## క్లుప్తంగా

### ఎంపీని కలిసిన కాంగ్రెస్ నాయకులు


ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డితో మద్దిరాల మండల కాంగ్రెస్ నాయకులు

మద్దిరాల : భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలుమల్ల యాదవ్ ఆధ్వర్యంలో మద్దిరాల మండల నాయకులు ఆదివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ వారితో మాట్లాడుతూ మద్దిరాల మండల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బానోతు మంజుల మాన్‌సింగ్, మల్యాల యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

### యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శికి సన్మానం


తిమ్మాపురం కాంగ్రెస్ నాయకులతో ఎమ్మెల్యే

అర్వపల్లి : యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా తిమ్మాపురం గ్రామానికి చెందిన జీడి సుధీర్ గెలుపొందగా ఆదివారం ఆయనను హైదరాబాద్‌లో తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్ సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు జీడి వీరస్వామి, పాలెల్లి సురేష్, నాయకులు బీరవోలు వాసదేవరెడ్డి, కోటిరెడ్డి, శేఖర్‌రెడ్డి, వీరారెడ్డి, భాస్కర్, నాగేందర్, బాలరాజు, రామారావు, జానయ్య, చంద్రయ్య, హరీష్‌రెడ్డి, సైదులు, రాజేష్, రవీందర్, వెంకన్న, మధు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మార్పీఎస్ కమిటీ ఎన్నిక


నియామక పత్రాన్ని అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు చింత వినయ్‌బాబు

చివ్వెంల : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) చివ్వెంల మండల అధ్యక్షుడిగా మండల పరిధిలోని అక్కలదేవిగూడెం గ్రామానికి చెందిన కొంగల సతీష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మండల కేంద్రంలోని వెంకట్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో నూతనంగా మండల కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కంపాటి విద్యాసాగర్, ఉపాధ్యక్షుడిగా భాష్పంగు బుచ్చిబాబు, అధికార ప్రతినిధిగా మొలుగూరి సునీల్, సంయుక్త కార్యదర్శిగా కోడి లక్ష్మణ్, సహాయ కార్యదర్శిగా మొండికత్తి మనోజ్ ఎన్నికయ్యారు. అదే విధంగా ఎంఎస్పీ మండల అధ్యక్షుడిగా చెరుకుపల్లి కిరణ్, కార్యదర్శిగా యాసాని రోహిత్‌ను ఎన్నుకున్నారు. ఎంఎస్పీ నియోజక వర్గ కోఆర్డినేటర్ ఎర్ర వీరస్వామి ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు యాతకుల రాజయ్య, సూర్యాపేట ఇన్‌చార్జ్ ములకలపల్లి రవి, బొడ్డు విజయ్, సిరపంగి లింగస్వామి, చెరుకుపల్లి సతీష్, నవీన్, మోహన్, జగదీష్, మహేందర్, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

### కరపత్రం ఆవిష్కరణ

మోతె : మండల పరిధిలోని రావిపహాడ్ గ్రామంలో నిర్మిస్తున్న ఇథనాల్ కంపెనీని రద్దు చేయాలని ఈ నెల 11 నుంచి ప్రచారయాత్ర నిర్వహిస్తున్నట్లు సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కమిటీ సభ్యుడు కారింగుల వెంకన్న తెలిపారు. ఈ మేరకు ఆదివారం రావిపహాడ్ గ్రామంలో ప్రచారయాత్ర కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా గ్రామంలో ఇథనాల్ కంపెనీ నిర్మించడం చట్ట విరుద్ధమన్నారు. ఇథనాల్ కంపెనీని రద్దు చేసి ప్రజల ప్రాణాలు రక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నాయకులు సయ్యద్, నారాయణరెడ్డి, సీపీఎం నాయకులు సోమగాని మల్లయ్య, కొప్పు వెంకన్న, బండి వేణు, ఉప్పలయ్య, మకు పాల్గొన్నారు.

### హరితహారం మొక్కలను కాపాడాలి

అర్వపల్లి : తెలంగాణకు హరితహారంలో నాటిన మొక్కలను కాపాడాలని అర్వపల్లి పంచాయతీ కార్యదర్శి డి.నవీన్‌రెడ్డి కోరారు. అర్వపల్లిలో హైవేపై పచ్చదనం కోసం పెంచుతున్న మొక్కలకు ఆదివారం గ్రామ పంచాయతీ సిబ్బందిచే ట్యాంకర్ ద్వారా నీటిని పోయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికులు లింగయ్య, యల్లయ్య పాల్గొన్నారు.


అర్వపల్లిలో మొక్కలకు నీళ్లు పోస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

# వసతులు లేక.. పాఠకులకు ఇబ్బందులు

- సమస్యల వలయంలో జాజిరెడ్డిగూడెం గ్రంథాలయం
- పెరుగుతున్న పాఠకుల సంఖ్య.. సరిపోని కుర్చీలు, బల్లాలు
- తాగునీటికీ ఇక్కట్లు
- కంటెగోడ నిర్మించక భవనంలోకి చేరుతున్న వర్షపు నీరు


జాజిరెడ్డిగూడెం గ్రంథాలయం


అసంపూర్తిగా నిలిచిన టాయిలెట్ల నిర్మాణం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో నెలకొన్న సమస్యలతో పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. అసంపూర్తి నిర్మాణాలతో నిత్యం సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ గ్రంథాలయంలో కనీస వసతులు కొరవడ్డాయి. పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి మండల వ్యాప్తంగా అనేకమంది అభ్యర్థులు జాజిరెడ్డిగూడెం గ్రంథాలయానికి వెళ్లి చదువుకుంటున్నారు. గ్రామంలోని పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువత కూడా రేయింబవళ్లు అక్కడే ఉండి పరీక్షలకు ప్రిపేరవుతున్నారు. కానీ వసతులు కరువై పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో వివిధ పథకాల నిధులు సుమారు రూ.10 లక్షలతో ఈ గ్రంథాలయానికి భవన నిర్మాణం జరిగింది. కానీ ఇంకా కొన్ని పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి.

**సౌకర్యాలు కరువు..**

గ్రంథాలయంలో చేపట్టిన నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. నిధుల లేమితో మరుగుదొడ్ల నిర్మాణ పనులు ఆగిపోయాయి. నీటి వసతి కూడా లేదు. బోరు వేసి ట్యాంక్ నిర్మాణం చేపట్టాలి. భవనం పైభాగంలో కంటె గోడ నిర్మాణం చేపట్టక వర్షపు నీళ్లు కిటికీలలో నుంచి భవనంలోకి వచ్చి పుస్తకాలు, పత్రికలు తడిచిపోతున్నాయి. వర్షాకాలమైతే పాఠకులు లోపల కూర్చొని చదువుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది. గ్రంథాలయంలో ఫర్నిచర్ సమకూర్చలేదు. ఏదో దాతలు ఇచ్చిన కొద్దిపాటి ఫర్నిచర్‌తో వెళ్ల దీస్తున్నారు. బల్లాలు, కుర్చీలు సరిపోను లేక పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. భవన నిర్మాణం జరిగినప్పటికి ఇంతవరకు రంగులు వేయలేదు. గ్రంథాలయం ముందుభాగంలో సీసీ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఇప్పటికైనా గ్రంథాలయంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని పాఠకులు కోరుతున్నారు. కాగా ఇటీవల ఈ గ్రంథాలయాన్ని జెడ్పీ సీఈఓ అప్పారావు సందర్శించగా పాఠకులు, గ్రామస్తులు గ్రంథాలయంలో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అయితే గ్రంథాలయంలో నెలకొన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

### కనీస వసతులు కల్పించాలి



జాజిరెడ్డిగూడెం గ్రంథాలయంలో పాఠకుల సంఖ్య పెరుగుతున్నా కనీస వసతులు లేవు. గ్రంథాలయంలో చేపట్టిన అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఆగిపోయాయి. ఇటీవల గ్రంథాలయాన్ని పరిశీలించిన జెడ్పీ సీఈఓ అప్పారావుకు సమస్యలను తెలియజేశాం. నీటి వసతి కల్పించి మరుగుదొడ్ల నిర్మాణ పనులు పూర్తిచేయాలి.

– బింగి కృష్ణమూర్తి, గ్రామస్తుడు

### పనులు పూర్తి కావాల్సి ఉంది



జాజిరెడ్డిగూడెం గ్రంథాలయంలో ఇంకా కొన్ని పనులు పూర్తి కావాల్సి ఉంది. ఈ విషయాన్ని పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వర్షపు నీరు భవనంలోకి రాకుండా కంటె గోడ నిర్మాణం చేపట్టాలని ఉన్నతాధికారులను కోరుతాం. పాఠకులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– దార శ్రీనివాస్, లైబ్రేరియన్

## రహదారులపై గుంతలు పూడ్చాలని పాదయాత్ర


జేఏసీ చేపట్టిన పాదయాత్రకు సంఘీభావం తెలుపుతున్న నాయకులు

ఆత్మకూర్(ఎస్) : సూర్యాపేట–దంతాలపల్లి ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని, రహదారులపై గుంతలను పూడ్చాలని డిమాండ్ చేస్తూ ఆత్మకూర్(ఎస్) మండల సామాజిక సేవ జేఏసీ నాయకులు ఆదివారం పాదయాత్ర చేపట్టారు. మండల పరిధిలోని కోటి నాయక్ తండా నుంచి ముక్కుడుదేవులపల్లి శివారు వరకు సుమారు 12 కిలోమీటర్లు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ అధ్యక్షుడు భూపతి రాములు మాట్లాడారు. గత మూడేళ్లుగా రోడ్లపై ఏర్పడిన గుంతలను పట్టించుకోకపోవడం కారణంగా ప్రమాదాలు జరిగి వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. రహదారులపై గుంతల పట్ల అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. కోటి నాయక్ తండా వద్ద ప్రారంభమైన జేఏసీ పాదయాత్రకు దుబ్బతండా, ఏనుబాముల, నెమ్మికల్ దండు మైసమ్మ ఆలయం వద్ద, పాతర్లపహాడ్ స్టేజీ వద్ద ఆయా గ్రామాల ప్రజలు, వివిధ పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు. పాదయాత్రలో జేఏసీ నాయకులు దండా వెంకటరెడ్డి, గంపల కృపాకర్, దొంతగాని కర్ణాకర్, జలగం మల్లేష్, గుండు వెంకన్న, పందిరి మాధవరెడ్డి, మేడి కృష్ణ, సాయికుమార్, గుండు రమేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు. కాగా మాజీ సర్పంచ్ జాటోతు రవీందర్, జాటోత్ పెద్ద శ్రీను, పీఏసీఎస్ డైరెక్టర్ అస్లాం, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, చందు నాయక్, సైదులు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు గంట నాగయ్య, సైదులు, నల్లెడ మాధవరెడ్డి, తదితరులు సంఘీభావం తెలిపారు.

## పత్తి కొనుగోళ్లు నిలిపివేత

నాగారం : మండల పరిధిలోని ప్రగతినగర్‌లో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాల్లో తుపాను హెచ్చరికల కారణంగా సోమవారం పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు తిరుమలగిరి మార్కెట్ కార్యదర్శి శ్రీధర్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రగతినగర్‌లో ఏర్పాటు చేసిన రెండు పత్తి కొనుగోలు కేంద్రాలకు సంబంధించి మిల్లులలో ఇప్పటికే పత్తి నిల్వలు అత్యధికంగా పేరుకుపోయాయని తెలిపారు. రైతుల పత్తి ఎగుమతులు, దిగుమతుల్లో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని అన్నారు. పైగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటుండడంతో రైతుల శ్రేయస్సు కోసమే సోమవారం పత్తి కొనుగోళ్లు నిలిపిస్తున్నామని, రైతులు సహకరించాలని కోరారు.

### 'కాంగ్రెస్‌ది దగా పాలన'

నాగారం : రాష్ట్రంలో కాంగ్రెస్‌ది ప్రజాపాలన కాదని, ప్రజా సమస్యలను విస్మరించి దగా పాలన చేస్తోందని మాజీ ఎంపీపీ కూరం మణివెంకన్న అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సరం కాలంగా ప్రజలకిచ్చిన ఏ ఒక్క హామీని పూర్తిగా నెరవేర్చలేదని తెలిపారు. హామీల విషయంలో ప్రజలు నిలదీయకుండా ఉండేందుకే విజయోత్సవాలు జరుపుతుందన్నారు. మహిళలకు రూ.2500ఆర్థికసాయం, సబ్సిడీ గ్యాస్, ఆడపిల్లలకు స్కూటీలు, రూ.4000 ఆసరా పెన్షన్ హామీలను మరిచారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకులను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు దేవరకొండ మురళి, సోమయ్య పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ, ఆర్థికసాయం


నాగారం : వర్ధమానుకోటలో మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్


అర్వపల్లి : కొమ్మాలలో మృతురాలి కుటుంబంతో మాట్లాడుతున్న యోగానందచారి

నాగారం : మండల పరిధిలోని వర్ధమానుకోట గ్రామానికి చెందిన దర్శనం రాములమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సామేల్ ఆదివారం మృతురాలి భౌతికకాయాన్ని సందర్శించి, మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.5,000 ఆర్థికసాయం అందజేశారు. అలాగే గ్రామానికి చెందిన బుర్ర వెంకన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందటంతో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.5,000 ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎల్మకంటి సోమన్న, బండగొర్ల జనార్దన్, వేముల రాంమూర్తి, ఎర్ర యాదగిరి, పానుగంటి నర్సింహారెడ్డి, ఆలకుంట్ల బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

**స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం**

వర్ధమానుకోట గ్రామానికి చెందిన బుర్ర వెంకన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా 1997–98 టెన్త్ బ్యాచ్‌కు చెందిన మృతుడి స్నేహితులు ఆదివారం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.36,000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బండగొర్ల జనార్దన్, మామిడి వెంకటేశ్వర్లు, కప్పల శంకర్, ఆకుల వెంకన్న, సిద్ధం వెంకన్న, వీరస్వామి, వడ్డే రవి, రవికుమార్, మధు తదితరులు పాల్గొన్నారు.

**మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం**

అర్వపల్లి : కొమ్మాల గ్రామానికి చెందిన మందుల శ్రీను తల్లి బుచ్చమ్మ ఆదివారం అనారోగ్యంతో మృతిచెందింది. మృతురాలి కుటుంబీకులను డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి పరామర్శించారు. రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, గిరిబాబు, శ్రీనివాస్, బొరోజు ఉపేందర్, సతీష్, రాము, సాయి తదితరులు పాల్గొన్నారు.

## యాసంగికి గోదావరి జలాలు విడుదల చేయాలి


వెలిశాలలో ఎస్సారెస్పీ కాల్వలో నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

తిరుమలగిరి : యాసంగి పంటలకు ఎస్సారెస్పీ కాల్వల ద్వారా గోదావరి జలాలు విడుదల చేయాలని సీపీఎం సీనియర్ నాయకుడు కడెం లింగయ్య, మండల కన్వీనర్ గుమ్మడవెల్లి ఉప్పలయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో వెలిశాల సమీపంలోని ఎస్సారెస్పీ కాల్వలో దిగి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇప్పటికే యాసంగి సీజన్ ప్రారంభమై 20 రోజులవుతుందని తెలిపారు. నీటి విడుదల ఆలస్యం అవుతుండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధికారులు స్పందించి నీటని వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కడారి లింగయ్య, మట్టిపల్లి లక్ష్మి, సోమయ్య, శ్రీను పాల్గొన్నారు.

## కోదాడ నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యం


సమావేశంలో మాట్లాడుతున్న మల్లయ్య యాదవ్

కోదాడ : మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి కోదాడ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి శూన్యమని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. వారు చేసిన అభివృద్ధి శిలాఫలకాలకే పరిమితమైందని విమర్శించారు. ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల సొమ్ముతో హెలికాప్టర్‌లో మంత్రులను వేసుకొని తిరగడం తప్ప ఆయన సంవత్సరకాలంగా చేసింది ఏమిటో చెప్పాలన్నారు. వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేశామని చెప్పుకుంటున్న మంత్రి, ఎమ్మెల్యే.. ఎక్కడైనా తట్టెడు మట్టి ఎత్తిన పనులు జరిగి ఉంటే చెప్పాలని ఆయన సవాలు చేశారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే కోదాడలో రోడ్ల విస్తరణ చేపట్టామని, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఎస్‌కె.నయీం, నర్సిరెడ్డి, భట్టు శివాజీ, అనంతుల ఆంజనేయులు, శెట్టి సురేష్‌నాయుడు, నాగిరెడ్డి, పిట్టల భాగ్యమ్మ, కర్ల సుందర్‌బాబు, రాంబాబుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి జిల్లా అభివృద్ధి ఘనత జగదీశ్‌రెడ్డిదే


మాట్లాడుతున్న బడుగుల లింగయ్య యాదవ్

సూర్యాపేటటౌన్ : ఉమ్మడి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిన ఘనత మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికే దక్కుతుందని మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. శనివారం నల్లగొండలో జరిగిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తూ ఆదివారం జిల్లా కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మెడికల్ కళాశాలలు తెచ్చిందెవరో ప్రజలకు తెలుసని అన్నారు. గత 10 ఏళ్లలో రాష్ట్రంలో కేసీఆర్, ఉమ్మడి జిల్లాలో జగదీశ్‌రెడ్డి చేసిన అభివృద్ధిని గురించి ఎవరిని అడిగినా చెబుతారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, నాయకులు వై. వెంకటేశ్వర్లు, నిమ్మల శ్రీనివాస్ గౌడ్, తూడి నర్సింహారావు, బూర బాలసైదులు గౌడ్, ఆకుల లవకుశ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ హయాంలోనే కుల సంఘాలకు ఆదరణ


తుంగతుర్తిలో పద్మశాలి భవన్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్

తుంగతుర్తి : కుల సంఘాలను ఆదరించింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన మార్కండేయ పద్మశాలి భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. నాడు తెలంగాణ ప్రభుత్వం వచ్చాకే కుల సంఘాలను ఆదరించి అన్ని రకాల కమ్యూనిటీ భవనాలను, కల్యాణ మండపాలను నిర్మించిందని తెలిపారు. నాడు కేసీఆర్ ప్రభుత్వం అన్ని కుల సంఘాలు ఆర్థికంగా ఎదిగేందుకు సౌకర్యాలు కల్పించిందన్నారు. అనంతరం పద్మశాలీలు మాజీ ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గుండగాని కవితరాములుగౌడ్, మాజీ వైస్‌ఎంపీపీ మట్టపల్లి శ్రీశైలం, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధకిషన్‌రావు, మాజీ సర్పంచ్ సంకినేని స్వరూప రవీందర్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, తిరుమలప్రగడ రాహుల్, పద్మశాలి సంఘం నాయకులు ఎనగందుల శ్రీనివాస్, ఎనగందుల గిరి, అశోక్, బద్దం శ్రీను, పెండెం గణేష్, పెండెం రాంమూర్తి పాల్గొన్నారు.

## నారాయణ, శ్రీచైతన్య స్కూళ్లపై చర్య తీసుకోవాలి


నారాయణ పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలో ఉన్న నారాయణ, శ్రీ చైతన్య పాఠశాలల్లో ఆదివారం కూడా తరగతులు నిర్వహిస్తున్నారని, ఆ రెండు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భారి అశోక్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నారాయణ, శ్రీచైతన్య పాఠశాలల ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేద, మధ్య తరగతి విద్యార్థుల నుంచి రూ.లక్షలు దండుకుంటున్నారని, వారిని ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఎన్నోసార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తగుళ్ల జనార్దన్, అంజి, గణేష్, శ్రీనివాస్, రాఘవ, త్యాగరాజ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆనాటి గురువులతో పూర్వ విద్యార్థులు

సూర్యాపేటటౌన్ : సూర్యాపేట పట్టణ పరిధి జమ్మిగడ్డలోని తిలక్ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2006–07 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి ఉపాధ్యాయులను సన్మానించారు. అదే విధంగా అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఆనాటి ఉపాధ్యాయులు ప్రభాకర్ రెడ్డి, అంకతి వెంకన్న, గోవర్ధన్, ప్రభాకర చారి, సోమయ్య, శోభారాణి, ఎల్లయ్య, పూర్వ విద్యార్థులు శ్రీకాంత్, నాగరాజు, ఆరిఫ్, జానీ బాబా, జాషువా, ప్రవీణ్, ఉపేందర్, శివ, చారి, క్రాంతి, శివ, అశోక్, నాజియా, ఫౌజియా, సునీత, శిరీష, సరిత, లక్ష్మి, దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల దీక్ష


అర్వపల్లి : ఎమ్మెల్యే సామేల్‌కు వినతిపత్రం అందజేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు


నాగారం : ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు


నూతనకల్ : నిరాహార దీక్షలో మాట్లాడుతున్న డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేపాక లింగయ్య

అర్వపల్లి : తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని మండల సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మూడవ రోజుకు చేరాయి. అర్వపల్లిలోని ఎమ్మార్సీ ఎదుట ఆదివారం రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో టీఎస్ఎస్‌యూఎస్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం శ్రీనివాస్, అధ్యక్షురాలు జి.నాగరాణి, వి.జానయ్య, వి.కవిత, చంద్రకళ, జ్యోతి, మంగమ్మ, సులోచన, బి.సైదులు, మురళీధర్‌రావు, ఆర్.విజయశ్రీ, వి.సరిత, సీహెచ్.రేణుక, ఆంజనేయులు, స్వప్నమేరి, బి.ఏడుకొండలు, వై. భవాని, వి.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి**

తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని జాజిరెడ్డిగూడెంలో సమగ్ర శిక్షా ఉద్యోగులు ఎమ్మెల్యే సామేల్‌కు ఆదివారం వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేస్తామని టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి అప్పట్లో హామీ ఇచ్చారని తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎస్‌యూఎస్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం శ్రీనివాస్, చంద్రకళ, వెలుగు సరిత, ఏడుకొండలు, మురళీధర్‌రావు పాల్గొన్నారు.

**సమగ్ర శిక్షా ఉద్యోగుల కమిటీ ఎన్నిక**

తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం(టీఎస్ఎస్‌యూఎస్) జాజిరెడ్డిగూడెం మండల నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలిగా జి.నాగరాణి, ఉపాధ్యక్షులుగా వి.జానయ్య, చంద్రకళ, ప్రధాన కార్యదర్శిగా బి.సైదులు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆర్.విజయశ్రీ, సహాయ కార్యదర్శులుగా వి.సరిత, సీహెచ్.రేణుక, కోశాధికారిగా ఆంజనేయులు, గౌరవ సలహాదారులుగా ఎం.స్వప్నమేరి, బి.ఏడుకొండలు, వై.భవాని ఎన్నికయ్యారు. టీఎస్ఎస్‌యూస్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్నికను నిర్వహించారు.

నూతనకల్ : సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించి కనీస వేతనం అందించాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేపాక లింగయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఎమ్మార్సీ కార్యాలయం ఆవరణలో సమగ్ర శిక్షా ఉద్యోగులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షకు మద్దతు తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తాడూరి వీరస్వామి, జటంగి లింగస్వామి, బొడ్డుపల్లి జానకిరాములు, కనకం రవీందర్ పాల్గొన్నారు.

నాగారం : సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి, న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు స్వామిగౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం నాగారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట ఎస్ఎస్ఏ ఉద్యోగుల ఆధ్వర్యంలో మూడవ రోజు రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం నాయకులు హరిప్రసాద్, కేజీబీవీ ఎస్ఓ శిరీన్, సరిత, వెంకటేశ్వర్లు, లత తదితరులు పాల్గొన్నారు.

## ఆలస్యంగా కొనుగోళ్లు.. ఆందోళనలో రైతులు


ధాన్యం పట్టాపై వర్షపు నీటిని తొలగిస్తున్న రైతులు

అర్వపల్లి : అర్వపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్న ధాన్యం కొనుగోలు కేంద్రంలో కొనుగోళ్లు నెమ్మదిగా జరుగుతున్నాయి. అయితే దీనికి తోడు వర్షం మూలంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం కురిసిన జల్లులకు కేంద్రంలోని కొంత ధాన్యం తడిసింది. రైతులు రాశులపై పట్టాలు కప్పినప్పటికీ అడుగు భాగంలో ధాన్యం తడుస్తోంది. వర్షానికి పట్టాలపై నిలిచిన నీటిని రైతులు ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు. హమాలీలు తక్కువగా ఉండటంతో కాంటాలు తొందరగా కావడంలేదని కొనుగోలు కేంద్రం నిర్వాహకులు చెబుతున్నారు. ఇప్పటికైనా తొందరగా కొనుగోళ్లను పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

## అడ్డంకులు అధిగమించాలి

ఆత్మకూర్(ఎస్) : ఎన్ని అడ్డంకులు ఉన్నా అధిగమించి ఆడపిల్లలు విద్యలో రాణించాలని ఎంవీఎఫ్ రాష్ట్ర కోఆర్డినేటర్ భాస్కర్ అన్నారు. ఆదివారం ఆత్మకూరు మండల కేంద్రంలో నిర్వహించిన ఆడపిల్లల సమానత్వ సమాఖ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడారు. నేటికీ ఆడపిల్లలపై వేధింపులు జరుగుతుండడం సమాజానికి సిగ్గుచేటు అని అన్నారు. ఆడపిల్ల అన్ని రంగాల్లో రాణించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అర్వపల్లి : అడివెంల 33కేవీ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగింపు కార్యక్రమం సోమవారం చేపట్టనున్నందున ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ ఏఈ వాస శ్రీకాంత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని తిమ్మాపురం, అడివెంల, కుంచమర్తి, రామన్నగూడెం గ్రామాల ప్రజలు అంతరాయానికి సహకరించాలని కోరారు.

### బిల్లులు మంజూరు చేయాలి

నడిగూడెం : పెండింగ్‌లో ఉన్న బిల్లులు మంజూరు చేయాలని మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకుల సంఘం మండల అధ్యక్షురాలు ఉమ ఆదివారం ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఏడు నెలలుగా బిల్లులు మంజూరు కావడంలేదని, అప్పులు చేసి విద్యార్థులకు భోజనం పెడుతున్నామని తెలిపారు.